# నమస్తే తెలంగాణ
## ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ ఆదివారం 3 నవంబర్ 2024 | ADILABAD NIRMAL


## నేత్రపర్వంగా దీపోత్సవం

బాసర, నవంబర్ 2 : సరస్వతీ అమ్మవారు కొలువైన బాసరలో క్షేత్రంలో శనివారం దీపోత్సవం కనుల పండువగా కొనసాగింది. ఆలయ ప్రాంగణంలో జ్యోతి ప్రజ్వలన చేసి దీపోత్సవ కార్యక్రమాన్ని అర్చకులు, వైదిక సిబ్బంది ప్రారంభించారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో దీపోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.



దీపోత్సవ కార్యక్రమంలో అర్చకులు

## కల్తీ కల్లు విక్రయాలపై ఆగ్రహం

ముథోల్, నవంబర్ 2 : బోరిగాం గ్రామంలో కల్తీ కల్లు విక్రయంపై మహిళలు శనివారం ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అమ్మకాలను నిలిపివేయాలని రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అమ్మకాలపై అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని, విక్రయాల వల్ల గ్రామస్తులు అనారోగ్యం బారిన పడుతున్నారని ఆరోపించారు. విషయం తెలుసుకుని ఘటన స్థలానికి ఎస్సై సాయికిరణ్‌తోపాటు ఎక్సైజ్ శాఖ అధికారులు చేరుకుని మహిళలను సముదాయించారు. కల్తీ కల్లు శాంపిళ్లను ల్యాబ్‌కు పంపించి రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకుంటామని చెప్పడంతో శాంతించారు.



మహిళలను సముదాయిస్తున్న ఎస్సై, ఎక్సైజ్ శాఖ అధికారులు

# తనిఖీలు సరే.. చర్యలేవీ?

**తూతూ మంత్రంగా సోదాలు చేయడం.. ఆపై ఊరుకోవడం**

- ఇటీవల ఆదిలాబాద్ జిల్లాలో ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు
- క్యాన్సర్ కారక పదార్థాలు వినియోగిస్తున్నట్లు గుర్తింపు
- పక్షం రోజులు అవుతున్నా చర్యలు శూన్యం
- ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న నిర్వాహకులు
- చోద్యం చూస్తున్న ఫుడ్‌సేఫ్టీ అధికారులు



ఆదిలాబాద్‌లోని ఓ రెస్టారెంట్‌లో తనిఖీ చేస్తున్న ఫుడ్‌సేఫ్టీ అధికారులు(ఫైల్)

ఆదిలాబాద్, నవంబర్ 2(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో పక్షం రోజుల కిందట పలు హోటళ్లలో ఫుడ్‌సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. రెస్టారెంట్‌లు, బిర్యానీ హౌస్‌లు, స్వీట్ హౌస్‌లపై దాడులు చేసి లోపాలను గుర్తించారు. ఆహార భద్రత ప్రమాణాల ప్రకారం రిఫ్రిజిరేటర్‌లను సరైన ఉష్ణోగ్రతల్లో మెయింటెన్ చేయకపోవడం, నాణ్యత లేని ప్లాస్టిక్ కవర్‌లలో కుళ్లిన మాంసం నిల్వ చేయడం, ప్రమాదకరమైన రంగులు కలిపిన చికెన్, చేపల లేబుల్, నాసిరకం పన్నీరు, మసాలాల వినియోగం, కుళ్లిన కూరగాయలను వినియోగిస్తున్నారని వెలుగు చూశాయి. హోటళ్లలో అపరిశుభ్రమైన వాతావరణంతోపాటు స్వీట్‌హౌస్‌లలో మిఠాయిల తయారీలో క్యాన్సర్ కారక కృత్రిమ రంగులను వినియోగించడం, మరిగించిన నూనెలను తినుబండారాల తయారీకి వాడడం, పురుగులు పట్టి దుర్వాసన వెదజల్లుతున్న పప్పులు, ఇతర లోపాలను టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు గుర్తించారు. ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హోటల్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేసి, పలు శాంపిళ్లను పరీక్షలకు పంపించారు.

### కొరవడిన తనిఖీలు

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని 20 రెస్టారెంట్‌లు, వంద వరకు స్వీట్‌హౌస్‌లు, ఇతర తినుబండారాల దుకాణాలు ఉన్నాయి. వీటి నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. అధికారుల తనిఖీలు కొరవడడంతో హోటళ్ల నిర్వాహకులు ప్రమాదకరమైన పదార్థాలను వినియోగించి ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుకుంటున్నారు. పలు రెస్టారెంట్‌లలో అపరిశుభ్రత వాతావరణం కారణంగా దుర్వాసన వస్తున్నది. వంట గదుల్లో కుళ్లిన పదార్థాలు, ఇతర వ్యర్థాలతో కంపు కొడుతున్నాయి. ఆహార పదార్థాలు తయారు చేసే వారు చెమటతో నిండిపోయి, గుట్కాలు తింటూ ఉంటారు. రెస్టారెంట్, హోటళ్లలో కుళ్లిన వెల్లుల్లి, తినుబండారాల రుచి కోసం ప్రమాదకరమైన పౌడర్‌లు, ఇతర కెమికల్స్ వినియోగిస్తారు. ఆహార భద్రత, మున్సిపాలిటీ అధికారులు హోటళ్లు, మిఠాయి షాప్‌లలో తరచూ తనిఖీలు నిర్వహించి కల్తీ వస్తువుల వినియోగించకుండా చర్యలు తీసుకోవాలి. ఈ ఏడాది ఇటీవల ఫుడ్ సెఫ్టీ టాస్క్‌ఫోర్స్‌అధికారులు చేపట్టిన తనిఖీలు తప్ప ఇతర తనిఖీలు లేవు. టాస్క్‌ఫోర్స్ అధికారుల తనిఖీల్లో జిల్లా కేంద్రంలోని రెస్టారెంట్‌లు, స్వీట్‌హౌస్‌లలో ప్రమాదకరమైన వస్తువులను వినియోగిస్తున్నట్లు గుర్తించినా చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. హోటళ్లలో కల్తీని నివారించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరుతున్నారు.



తనిఖీల్లో గుర్తించిన కల్తీ ఆహార పదార్థాలు(ఫైల్)



నిర్మల్ మీదుగా వెళ్తున్న హైదరాబాద్-నాగ్‌పూర్ ఎన్‌హెచ్-44



భైంసా నుంచి బాసర మీదుగా నిజామాబాద్ జిల్లాలోని బోధన్ వరకు కొనసాగుతున్న హైవే నంబర్-161 పనులు

# హైవే కారిడార్

**నిర్మల్ కేంద్రంగా నాలుగు రాష్ట్రాలకు లింకేజీ**

- ఐదు జిల్లాలతో అనుసంధానం
- చివరి దశలో రెండు హైవే నిర్మాణ పనులు
- మెరుగు పడనున్న రోడ్డు రవాణా
- విస్తరించనున్న వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు

నిర్మల్, నవంబర్ 2(నమస్తే తెలంగాణ) : నిర్మల్ జిల్లా కేంద్రంగా హైవే కారిడార్ ఏర్పడనున్నది. ఈ కారిడార్ నాలుగు రాష్ట్రాలకు లింకేజీగా మారబోతున్నది. అలాగే నిర్మల్‌తోపాటు మరో ఐదు జిల్లాలకు కూడా ఈ హైవేలు అనుసంధానం కానున్నాయి. ఇప్పటికే హైదరాబాద్ నుంచి నాగ్‌పూర్ వరకు నేషనల్ హైవే-44 కొనసాగుతుండగా, కొంతకాలం క్రితమే మహారాష్ట్రలోని కల్యాణ్ నుంచి భైంసా మీదుగా నిర్మల్ వరకు నేషనల్ హైవే-61 రోడ్డు ప్రారంభమైంది. ఈ రెండు హైవేలతో మహారాష్ట్రకు లింకేజీ కొనసాగుతున్నది. ప్రస్తుతం ఈ రెండు హైవేలు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా పరిధిలో ఉన్నాయి. ఈ హైవేకు మరో హైవేను లింకేజీ చేస్తూ నేషనల్ హైవే శాఖ(ఆర్ అండ్ బీ) నిర్మల్ నుంచి ఖానాపూర్ మీదుగా జగిత్యాల వరకు జాతీయ రహదారిని నిర్మిస్తున్నది. ప్రస్తుతం నిర్మల్ నుంచి ఖానాపూర్ వరకు రోడ్డు పనులు పూర్తయ్యాయి. దాదాపు రూ.140 కోట్లతో ఈ రోడ్డు పనులు చేపట్టారు. ఈ రోడ్డు కవ్వాల్ అభయారణ్యం పరిధిలో ఉండడంతో ఇక్కడి వన్యప్రాణుల రక్షణ కోసం రూ.40 కోట్లతో ఏడు చోట్ల అండర్ పాస్‌లను నిర్మిస్తున్నారు. ఈ పనులు కూడా చివరి దశకు చేరుకున్నాయి. దీంతోపాటు నిజామాబాద్ జిల్లాలోని బోధన్ నుంచి బాసర మీదుగా భైంసా వరకు నేషనల్ హైవే-161 పరిధిలో రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం 70 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి. రూ.388 కోట్లతో ఈ రోడ్డు పనులను చేపట్టారు. నిర్మల్ జిల్లాలో 30 కిలోమీటర్లు, నిజామాబాద్ జిల్లాలో 26.4 కిలోమీటర్ల పొడవుతో ఈ రోడ్డు నిర్మాణం కొనసాగుతున్నది. ఇదే రోడ్డు పరిధిలో బాసర గోదావరిపై దాదాపు రూ.40 కోట్లతో మరో కొత్త వంతెనను నిర్మిస్తున్నారు. అలాగే బాసర రైల్వే స్టేషన్ వద్ద ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ఫ్లై ఓవర్‌ను నిర్మించారు. పనులు వేగంగా సాగుతుండడంతో త్వరలోనే ఈ రోడ్డు అందుబాటులోకి రానున్నది.



నిర్మల్ నుంచి భైంసా మీదుగా మహారాష్ట్రలోని కల్యాణ్ వరకు పూర్తయిన ఎన్‌హెచ్-61

### నాలుగు రాష్ట్రాలకు లింకేజీ

నిర్మల్ జిల్లా మీదుగా ఇప్పటికే నేషనల్ హైవే-44 కొనసాగుతున్నది. ఈ హైవేతో నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, ఆదిలాబాద్ జిల్లాలకు మహారాష్ట్రతో లింకేజీ ఏర్పడింది. అలాగే నేషనల్ హైవే-61లో భాగంగా మహారాష్ట్రలోని కల్యాణ్ నుంచి నిర్మల్ వరకు రోడ్డు ఏర్పడడంతో మహారాష్ట్రలోని మరో ప్రాంతానికి నిజామాబాద్, నిర్మల్ జిల్లాలు అనుసంధానమయ్యాయి. ఇదిలా ఉంటే నిర్మల్ నుంచి ఖానాపూర్ మీదుగా జగిత్యాల వరకు నిర్మిస్తున్న నేషనల్ హైవే కారణంగా నిర్మల్ జిల్లాకు మరో కొత్త హైవే లింకేజీ కాబోతున్నది. అలాగే బోధన్ నుంచి బాసర మీదుగా భైంసా వరకు నిర్మిస్తున్న 161 బీబీ (బోధన్-బాసర-భైంసా) హైవే రోడ్డుతో కర్ణాటక రాష్ట్రానికి లింకేజీ ఏర్పడనున్నది. ఈ నేషనల్ హైవే హైదరాబాద్ నుంచి మద్నూరు వెళ్లే రోడ్డుకు కనెక్ట్ కానున్నట్లు అధికారులు చెబుతున్నారు. అలాగే ఈ హైవేతో ఆంధ్రప్రదేశ్‌కు కనెక్టివిటీ ఉంటుందని ఎన్‌హెచ్ అధికారులు పేర్కొంటున్నారు. మొత్తానికి ఈ నాలుగు హైవేలతో నిర్మల్ జిల్లా వాసులకు నాలుగు రాష్ట్రాలకు కనెక్టివిటీ ఏర్పడనున్నది.

### విస్తరించనున్న వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు

నాలుగు జాతీయ రహదారులు.. నాలుగు రాష్ట్రాలను కనెక్టివిటీ చేయనున్న కారణంగా ఈ హైవేల పరిధిలో ఉన్న అన్ని జిల్లాల్లో వ్యాపార, వాణిజ్య రంగాలు విస్తరించే అవకాశం ఉన్నది. నిర్మల్ జిల్లాతోపాటు ఆదిలాబాద్, మంచిర్యాల, జగిత్యాల, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలతో వ్యాపార కార్యకలాపాలు విస్తరించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని ఇక్కడి వ్యాపారులు చెబుతున్నారు. ఇప్పటికే కల్యాణ్ నుంచి నిర్మల్ హైవే నిర్మాణం పూర్తి కావడంతో నిర్మల్, నిజామాబాద్ జిల్లాలకు చెందిన వ్యాపారులు నాందేడ్‌తో పాటు జాల్నా, పర్బనీ, ఔరంగాబాద్, ముంబాయి వంటి నగరాలకు వెళ్లి వ్యాపార లావాదేవీలు కొనసాగిస్తున్నారు. అలాగే హైదరాబాద్ నుంచి నాగ్‌పూర్ వరకు గల నేషనల్ హైవే-44తో కూడా వ్యాపార వాణిజ్య రంగాలు గణనీయంగా విస్తరించాయి. మరో రెండు జాతీయ రహదారుల పనులు ప్రస్తుతం కొనసాగుతున్న నేపథ్యంలో అవి కూడా పూర్తయితే రాబోయే రోజుల్లో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందేందుకు మార్గం ఏర్పడనున్నది.



నిర్మల్ నుంచి ఖానాపూర్ మీదుగా జగిత్యాల వరకు నూతనంగా నిర్మిస్తున్న హైవే



## సదర్ సంబురం

**ఆకట్టుకున్న విన్యాసాలు**

దున్నపోతుతో విన్యాసాలు చేయిస్తున్న రైతు

*భైంసా పట్టణంలోని సార్వజనిక్ గౌళి ఆధ్వర్యంలో శనివారం సదర్ ఉత్సవాలు కనుల పండువగా కొనసాగాయి. ఈ సందర్భంగా పురాణ బజార్, కిసాన్‌గల్లి, భట్టి గల్లి నుంచి దున్నపోతులను తీసుకొచ్చి ఊరేగింపు చేపట్టారు. దీపావళి అనంతరం పాడ్యమి రోజున ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. ఈ కార్యక్రమంలో సదానంద్ యాదవ్, ద్వారకేశ్ యాదవ్, మున్నా యాదవ్, లఖన్ యాదవ్, దుర్గేశ్ యాదవ్, కుంట శేఖర్, కుంట రాజేశ్వర్, కుమార్ యాదవ్ పాల్గొన్నారు.* - భైంసా, నవంబర్ 2

# దాడి చేసింది.. రాయల్ బెంగాల్ టైగర్



**కోడె మృతి.. ప్రాణాలతో కొట్టు మిట్టాడుతున్న గేదె..**

- సీసీ కెమెరాలకు చిక్కిన పెద్దపులి
- మహారాష్ట్రలోని కిన్వట్ ప్రాంతం నుంచి వలస
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..
- పులి భద్రత దృష్ట్యా విద్యుత్ కంచెలు, ఉచ్చులు బిగించొద్దు..
- పశువుల కాపరులు జాగ్రత్తగా ఉండాలి..
- నష్టపోయిన రైతులకు పరిహారం అందిస్తాం..
- ప్రజలు, రైతులకు సూచించిన అటవీ శాఖ సిబ్బంది

కుంటాల, నవంబర్ 2 : నిర్మల్ జిల్లా కుంటాల మండలంలోని సూర్యాపూర్-మెదన్‌పూర్ గ్రామాలను అనుకుని ఉన్న అటవీ ప్రాంతంలో తాజాగా కోడె, లేగదూడపై పెద్దపులి దాడి చేయడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. శుక్రవారం కోడెపై దాడి చేయడంతో మృతి చెందగా, గేదెపై దాడి చేయగా ప్రస్తుతం ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నది. విషయం తెలుసుకున్న అటవీ శాఖ సిబ్బంది ఘటన స్థలాన్ని పరిశీలించారు. మాంసాన్ని తినడానికి అదే చోటుకు వస్తుందని అంచనా వేసి కెమెరాలను అమర్చారు. శనివారం ఉదయం పుటేజీని పరిశీలించగా 6 నుంచి 7 ఏళ్ల వయస్సు గల రాయల్ బెంగాల్ జాతి మగ పులి అని భైంసా ఎఫ్‌ఆర్‌వో వేణుగోపాల్ గుర్తించారు. అటవీ శాఖ సిబ్బంది గ్రామస్తులకు అవగాహన కల్పిస్తూ మహారాష్ట్రలోని కిన్వట్ ప్రాంతం నుంచి ఇటువైపుగా వచ్చి ఉంటుందని తెలిపారు. ఇటీవల పులుల సంతతి పెరగడంతో అటూ ఇటూ సంచరిస్తుంటాయన్నారు. వంద చదరపు మీటర్ల పరిధిలో తిరగొచ్చు అని.. మెదన్‌పూర్, దౌనెల్లి, సూర్యాపూర్, అంబుగాం గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అటవీ సిబ్బంది బృందాలుగా ఏర్పడి పులి కట్టడికి చర్యలు తీసుకుంటాయని, పులి భద్రత దృష్ట్యా చేలలో అమర్చే విద్యుత్ కంచెలు, ఉచ్చులు తీసివేయాలని రైతులను కోరారు. అడవిలోకి వెళ్లే పశువుల కాపర్లు జాగ్రత్తగా ఉండాలని కోరారు. పులి దాడి వల్ల నష్టం కలిగిన రైతులకు పరిహారం అందేలా చూస్తామని, ఎవరైనా పులికి హాని కలిగిస్తే వన్యప్రాణి చట్టం 1972 కింద చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఇందులో ఎఫ్‌ఎస్‌వో కీర్తి, ఎఫ్‌బీవో హరిలత, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



కెమెరాను బిగిస్తున్న అటవీ సిబ్బంది (ఫైల్)



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న అటవీ అధికారులు

### నష్ట పరిహారం చెల్లించాలి..

పులి దాడితో ఆస్తినష్టం కలిగిన వారికి ప్రభుత్వం నష్ట పరిహారం ఇవ్వాలని బాధిత రైతులు కోరుతున్నారు. కుంచపు సాయన్నకు చెందిన కోడె దూడపై దాడి చేయగా అక్కడికక్కడే మరణించింది. అనంతరం సబ్బని లక్ష్మణ్ గేదెపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. అడవిలో ఈ జంతువులను మేతకు తీసుకెళ్లిన పశువుల కాపరి చామ హన్మంతు పులి దాడి నుంచి తప్పించుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించాడు. తన వైపు వస్తున్న పులిని గమనించి చెట్టు ఎక్కానని, చెట్టు చుట్టూ కొన్నిసార్లు తిరిగి వెళ్తూ గేదె దూడపై దాడి చేసిందని చెప్పాడు. అనంతరం పెద్దపులిని చూసిన భయంతో అదే షాక్‌తో ఇంటికి వచ్చి మంచాన పడ్డానని ఆ వృద్ధ కాపరి వాపోయాడు

## సీఎంతో విశ్వవిద్యాలయ ఉప కులపతుల సమావేశం

బాసర, నవంబర్ 2 : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన విశ్వవిద్యాలయాల ఉప కులపతుల సమావేశంలో ఆర్జీయూకేటీ బాసర ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్ పాల్గొన్నారు. ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఉన్నత విద్యామండలి చైర్మన్‌తో పాటు అన్ని యూనివర్సిటీల వైస్ చాన్స్‌లర్లు ముఖ్యమంత్రి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విద్యామండలి, వీసీలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్ మాట్లాడుతూ ఆర్జీయూకేటీ బాసరలోని పరిస్థితులపై సమగ్ర అధ్యయనం చేసి ప్రమాణాలను పెంచే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



విశ్వవిద్యాలయాల వీసీల సమావేశంలో పాల్గొన్న వీసీలు

## కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

**మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి**

ఎదులాపురం, నవంబర్ 2 : జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి కొనుగోళ్లపై ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల వద్ద ప్యాడీ క్లీనర్లు, క్యాలిపర్స్‌ను యుద్ధ ప్రాతిపదికన సమకూర్చాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లో 48 గంటల్లోపు డబ్బులు జమ అయ్యేలా చూడాలని అన్నారు. పక్క రాష్ట్రాల ధాన్యం మన కొనుగోలు కేంద్రాలకు రాకుండా సరిహద్దు ప్రాంతాల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు అంచనా 3,400 మెట్రిక్ టన్నుల అంచనా అని, ఎంఎస్పీ రేట్ గ్రేడ్ ఏ-రూ.2320, కామన్ గ్రేడ్ రూ.2300, అదనంగా సన్న రకానికి రూ.500 బోనస్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, సివిల్ సప్లయ్ ఆఫీసర్ మహ్మద్ వాజిద్ అలీ, డీఎం సుధ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్ స్వామి పాల్గొన్నారు.

### వేగవంతం చేయాలి : మంత్రి

నిర్మల్ చైన్‌గేట్, నవంబర్ 2 : ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి ప్రత్యేక కార్యదర్శి దేవేందర్ సింగ్ చౌహాన్‌తో కలిసి ఆయన ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. నిర్మల్ కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ అభిలాష అభినవ్, అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ 287 కేంద్రాలకు 97 కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాజర్షి షా, అధికారులు

## సర్వేకు ఏర్పాట్లు చేయండి..

ఇంటింటి సమగ్ర సర్వేకు ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రణాళిక కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటికే ఇంటింటి సర్వేకు సంబంధించి హౌస్ లిస్టింగ్ ప్రక్రియను చేపట్టినట్లు తెలిపారు. ఎన్యూమరేటర్లు అందరికి శిక్షణ పూర్తి చేశామని, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులతో సర్వేను చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, సీపీవో జీవరత్నం, డీఎస్‌వో కిరణ్‌కుమార్, డీఎం వేణుగోపాల్, జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, డీఆర్డీవో విజయలక్ష్మి, ఏడీ మార్కెటింగ్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.